క్లుప్తంగా

మానవ జీవితానికి చెట్లు జీవనాధారం

పెదకూరపాడు: మానవ జీవితానికి చెట్లు జీవధారమని ఎంపీడీవో మల్లేశ్వరి అన్నారు. పెదకూరపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జాతీయ ఉపాధి హామీ సిబ్బందితో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతలు స్వీకరిస్తే భవిష్యత్ తరాలకు నాణమైన , కాలుష్య రహిత సమాజం అందించినట్లు ఉంటుందన్నారు. ఏపీవో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ల తహసీల్దార్‌గా భవానిశంకర్



ముప్పాళ్ళ: ముప్పాళ్ల తహసీల్దార్‌గా మదమంచి భవానిశంకర్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇప్ప టి వరకు తహసీల్దార్‌గా పనిచేసిన పి.సింగారావు ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. కార్యాలయంలో వీఆర్వోలు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. డీటీ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆర్‌ఐలు వపన్‌కుమార్, కపిల్, ఆంజనేయులు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

బెల్లంకొండ తహసీల్దారుగా అఫ్రపున్నీసా బేగం



బెల్లంకొండ: తహసీల్దారుగా షేక్. అఫ్రపున్నీసా బేగం శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. యడ్లపాడు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆమె ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇప్పటివరకూ ఇన్‌చార్జిగా పనిచేసిన బి.నిర్మలను డెప్యూటి తహసీల్దారుగా నియమించారు.

వితంతు పింఛనుకు దరఖాస్తుల ఆహ్వానం

ముప్పాళ్ళ: ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వితంతు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు చెప్పారు. మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సివిల్‌జడ్జి(సీనియర్‌డివిజన్) సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు సూచనల మేర ముప్పాళ్ల గ్రామ సచివాలయంలో వితంతు పెన్షన్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంత మందికి వితంతు పింఛన్ అందుతుందో.. అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాసుదారులతో మాట్లాడారు. పారాలీగల్ వలంటీర్ షేక్ సుభాని, పంచాయతీ కార్యదర్శి ఆర్.నాగేశ్వరరావు, ఐ.హరికృష్ణ, వెల్ఫేర్ కార్యదర్శి ఎం.యోగేశ్వరరావు పాల్గొన్నారు.

శాకాంబరీదేవి అలంకారంలో అమ్మవారు

నకరికల్లు: ఆషాఢ మాస శివరాత్రి వేడుకలను మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న మరకత లింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు, పవన్ కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో అమ్మవార్లను శాకంబరీదేవిగా అలంకరించారు. పొంగళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించారు.

అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

క్రోసూరు: ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర అధ్యక్షుడు బుల్ల రాజారావు పిలుపు మేరకు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. మండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గార్లపాటి దాసు, జిల్లా అధ్యక్షుడు, డాక్టర్ షరీఫ్, కంచర్ల అచ్యుతరావు, నాగయ్య, శ్రీనివాసరావు, ప్రసాదు, జయపాల్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకం

సత్తెనపల్లి: వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునివ్వడంపై ఎమ్మార్పీఎస్, మాదిగ ఉద్యోగ, విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. అమరావతి బస్టాండ్ సెంటర్‌లోని జగ్జీవన్ రామ్ విగ్రహం, తాలూకా సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. తాలూకా సెంటర్‌లో మంద కృష్ణమాదిగ ఫొటోకు క్షీరాభిషేకం చేశారు. ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపల్ జాన్సన్, ఎంఈఎఫ్ జిల్లా నాయకులు చిలుకా ఆగస్టస్ బాబులు మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ సారథ్యంలో 30 ఏళ్ల కల సాకారమైందన్నారు. రమణయ్య, నాగేశ్వరరావు, భిక్షాలు, దయాన్, కె. సురేష్ ఉన్నారు.

30 ఏళ్ల పోరాటానికి న్యాయం జరిగింది

క్రోసూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు నేపథ్యంలో సుదీర్ఘ 30 ఏళ్ల పోరాట ఫలితంగా న్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ మండల కమిటీ హర్షం వ్యక్త పరిచింది. ఈ సందర్భంగా క్రోసూరులో ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ర్యాలీలో మండల అధ్యక్షుడు జడ సుబ్బు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ న్యాయబద్ధమైన అంశమే అని సుప్రీంకోర్టు తీర్పు పట్ల మాదిగ జాతి, మాదిగ ఉపకులాలకు న్యాయం జరిగిందని హర్షం వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, మాదిగ ఉద్యోగులు పాల్గొన్నారు.

కుక్కలున్నాయి.. పిక్కలు భద్రం

- డివిజన్ వ్యాప్తంగా పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- భయాందోళనలో సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల ప్రజలు
- నియంత్రణ పై కనిపించని మున్సిపల్, పంచాయతీ అధికారుల చర్యలు



పట్టణంలోని పార్క్ ఏరియా సమీపంలో వీధి కుక్కలు



సత్తెనపల్లి పట్టణంలోని రాజులకాలనీలో వీధికుక్కలు

సత్తెనపల్లి: మొరిగే కుక్క కరవదని అంటారు. అది ఒకప్పటి మాట. ఇప్పుడు మొరగని కుక్కతో పాటు మొరిగే కుక్క సైతం పిక్కలు పట్టుకొని పీకుతున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా వెంటాడి కరుస్తున్నాయి. పాదచారులు, వాహనదారులు, చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా దాడి చేస్తున్నాయి. కుక్కల సంతతి రోజు రోజుకు పెరుగుతోంది. నిత్యం ఒకరో ఇద్దరో వాటి బారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారు. అయితే నివారణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు విఫలమవుతున్నారు. బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు లేకపోలేదు. సత్తెనపల్లి డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని సత్తెనపల్లిపట్టణం, సత్తెనపల్లిరూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు, పెదకూరపాడు, అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, బెల్లంకొండ మండలాల్లోని గ్రామాల్లో వీధి కుక్కల సంఖ్య పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కుక్కల గుంపులు అధికమయ్యాయి. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడికి దిగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజులు గడిచినా.. గ్రామాల పర్య వేక్షణను గాలికి వదిలేశారు. సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రహదారులపై మరింత ప్రమాదం

రహదారుల పక్కన గుంపులు గుంపులుగా ఉన్న శునకాలు ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సత్తెనపల్లి మండల పరిధిలోని రెంటపాళ్ల, పాకాలపాడు గ్రామాల్లో సత్తెనపల్లి-అచ్చంపేట ప్రధాని రహదారిలో ద్విచక్ర వాహన చోదకుల పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. రహదారిపై వెళుతున్న చోధకులపై దాడులకు దిగుతున్నాయి. ఇక్కడ అనేక మంది శునకాల కారణంగా ప్రమాదాలు సంభవించి గాయాలతో ఆసుపత్రి పాలైన సంఘటనలు ఉన్నాయి. గ్రామాల్లో ఎక్కడైనా కుక్క కాటుకు గురైన వారు అధికారులను నిలదీస్తే నామమాత్రంగా ఒకరోజు కుక్కల్ని పట్టే కార్యక్రమం చేపట్టి మమా అనిపిస్తున్నారు. నూతన వ్యక్తులు గ్రామాల్లోకి, పట్టణంలోని వార్డుల్లో అడుగు పెట్టాలంటే భయాందోళన చెందుతున్నారు. పట్టణంలోని రాజులకాలనీ, వాల్మీకి మహర్షినగర్, పార్క్‌రియా, నాగన్నకుంట, రఘురా నాగార్జునగర్, క్రిస్టియన్ పేట, సుగాలీ కాలనీ తదితర ప్రాంతాలతో పాటు కొన్ని గ్రామాల్లో చీకటి పడితే శునకాల భయంతో ప్రజలు వీధుల్లోకి అడుగుపెట్టడం లేదు.

అధికారుల చర్యలేవి?

పట్టణంలోని వార్డుల్లో, గ్రామాలలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ దాడులు చేస్తున్నా వాటి నియంత్రణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆవేదన ప్రజల్లో వ్యక్తమవతోంది. కుక్కల దాడుల్లో ఆసుపత్రి పాలవుతున్నామని బాధితులు వాపోతున్నారు. వాహనాలపై వెళ్లే వారిని వెంబడించి దాడి చేస్తుండడం తీవ్రతకు అద్దం పడుతోందని చెబుతున్నారు. కొన్ని ఇళ్లల్లోకి సైతం చొర బడుతున్నాయి. మరి కొన్ని పిల్లలు, వృద్ధుల వెంటబడి తరుముతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కలు దాడి చేస్తాయిలా...

కుక్కల దాడి నుంచి తప్పించుకునేందుకు పెద్దలు శతవిధాల ప్రయత్నిస్తారు. మరి చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉంటుంది. కుక్కల ఎత్తుకు పెద్దవారికైతే కాలి పిక్కలు పట్టి లాగుతాయి. పిల్లల ఎత్తుకు శునకాలు సమాంతరంగా ఉండటంతో ముఖం, మెడ, చెవి, వీపు భాగాల్లో దాడి చేస్తాయి. కాటేసిన శరీర భాగం లోతు ఆధారంగా చికిత్స కు సిఫార్సు చేస్తారు.

ఈ జాగ్రత్తలు పాటించండి

- మాంసం దుకాణాలు, హోటళ్ల వద్ద ఆహార వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలి.
- పెంపుడు కుక్కలకు రేబిస్ సోకకుండా ఏడాదికోసారి విధిగా టీకాలు ఇప్పించాలి.
- వీధి కుక్కలకు కూడా పురపాలక, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో టీకాలు ఇప్పించే కార్యక్రమాలు నిర్వహించాలి.
- అన్ని వీధుల్లో శునకాలు స్వైర విహారం చేస్తున్నందున పిల్లలను ఒంటరిగా బయటకు పంపరాదు.
- నియంత్రణకు స్థానిక సంస్థలు, పశుసంవర్ధక శాఖతో సమన్వయం చేసుకొని ప్రణాళికలు రూపొందించాలి.
- కుక్క కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై అవగా హన పెంచాలి.



బయటకు రావాలంటే భయమేస్తోంది

పట్టణంలోని నాగన్న కుంటలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రోజూ 20 నుంచి 30 కుక్కల వరకు రోడ్ల పైనే ఉంటున్నాయి. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయమేస్తోంది. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్డు వెంట నడుస్తుంటే వెంటబడి కరుస్తున్నాయి. ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించు కోవడం లేదు.

–జింకా లక్ష్మీ, మహిళ, నాగన్నకుంట



వీధి కుక్కలకు ఏబీసీ చేయిస్తాం

వర్షాకాలం కావడంతో వీధికుక్కలు పట్టణంలోని కొన్ని వార్డుల్లో ఉన్నాయి. పట్టణ వ్యాప్తంగా 481 వీధి కుక్కలను గుర్తించాం. వీటికి స్టేరిలైజేషన్ చేయించేందుకు ఏజెన్సీని కూడా గుర్తించాం. తొందరలోనే యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) చేయిస్తాం. వీటితో పాటు యాంటి రేబీస్ వ్యాక్సిన్ కూడా వేయిస్తాం.

–కొలిమి షమ్మి, కమిషనర్, సత్తెనపల్లి

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



పెదకూరపాడు: గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు పింగళి వెంకయ్య అని పెదకూరపాడు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ రమణ అన్నారు. శుక్రవారం పెదకూరపాడులోని జెడ్పీ పాఠశాల నందు జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. కేవీ రమణ మాట్లాడుతూ 1876లో కృష్ణా జిల్లాలో జన్మించిన పింగళి వెంకయ్య గాంధీ సూచన మేరకు జాతీయ పతాకం రూపొందించిన తెలుగు వాడిగా గుర్తింపు పొందారన్నారు. వెంకయ్యకు భారత రత్న ఇవ్వాలని కోరారు.

చెట్ల పెంపకంపై అవగాహన

బెల్లంకొండ: అటవీ యేతర ప్రాంతాల్లో చెట్ల పెంపకం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని పిడుగురాళ్ల డివిజన్ ఉద్యాన శాఖ అధికారి వై.మోహన్ తెలిపారు. శుక్రవారం చంద్రాజుపాలెం గ్రామంలో అటవీ యేతర ప్రాంతాల్లో చెట్ల పెంపకంపై రైతులకు శిక్షణ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పంట భూములు, పొలాల గట్ల వెంబడి చెట్ల పెంపకం వల్ల భూమి కోతకు గురికాకుండా ఉంటుందని పేర్కొన్నారు. ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా (టీఓఎఫ్ఐ) ప్రోగ్రాం స్టేట్ అసోసియేట్ ప్రణీత్ వర్మ చెట్ల పెంపకం వలన కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నరసింహారెడ్డి, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ రజిని, రైతులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు ఐక్యం కావాలి



అంబేడ్కర విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు

అమరావతి: ఎస్సీ వర్గీకరణ బిల్లు వ్యతిరేకంగా దేశంలో ఉన్న మాలలందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరముందని మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకతోటి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని, మాట్లాడుతూ గతంలో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కోర్టు తిరస్కరించినా.. నేడు కేంద్ర ప్రభుత్వ ప్రోద్బలంతో అత్యున్నత న్యాయ స్థానం తీర్పునివ్వటం అన్యాయమన్నారు. దేశ వ్యాప్తంగా, ప్రజాస్వామ్యవాదులు, అంబేడ్కర్ ఆశయ సాధకులు ఈ అంశంపై పోరాడాలన్నారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 341 ప్రకారం రాష్ట్రపతి జారీచేసిన కులాల జాబితాను మార్చే అధికారం లేదని జస్టిస్ బేలా ఎం.త్రివేది ఇచ్చిన తీర్పు కూడా పక్కన పెట్టడం దారుణమన్నారు. ఈ పోరాటంలో ఈ నెల9న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పెద్దెత్తున నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. మాల సోదరులందరూ ఈ నిరసనకు తరలిరావాలని కోరారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు బెజ్యం అక్షయ్‌కుమార్, సొంగా రాము, గొట్టెం చంద్రయ్య, కృష్ణ, తోకల వర్మ, సాగర్, వినోద్ పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయం

- సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు
- 75 త్యాళ్లూరులో పాడి రైతులకు బోనస్‌లు పంపిణీ



75 త్యాళ్లూరులో బోనస్‌లు పంపిణీ చేస్తున్న ధర్మారావు

పెదకూరపాడు: పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా సంగం డెయిరీ కృషి చేస్తుందని సంగం డైయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు అన్నారు. మండలంలోని 75 త్యాళ్లూరులో 2023-24 ఆర్థిక సంవత్సరానికి పాలు పోసిన రైతులకు డెయిరీ మేనేజర్ ఆదినారయణ, సంఘం అధ్యక్షుడు గుత్తికొండ శ్రీనివాసరెడ్డితో కలసి బోనస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ పాడి కుటుంబాల శ్రేయస్సు కోసం దూళ్లిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ హస్పిటల్ ద్వారా రాయితీపై వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. పశు బీమా, పశు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సబ్సిడీపై పశు గ్రాస విత్తనాలు అందిస్తున్నామన్నారు. సంఘం అధ్యక్షుడు గుత్తికొండ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ సంఘం పరిధిలో 113 మంది పాడి రైతులకు రూ.1.93 లక్షల బోనస్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌రావు, వెంకటేశ్వర్లు, ఈదా ఆంజిరెడ్డి, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ మాతకు ఆషాఢం సారె సమర్పణ



సత్తెనపల్లి: ఆర్య వైశ్య చలివేంద్ర సంఘం, పట్టణ ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఆషాఢ మాసంను పురస్కరించుకొని పట్టణంలోని మాచర్ల రోడ్డులో ఉన్న శ్రీ వాసవి కనకా పరమేశ్వరి అమ్మవారికి ఆషాఢం సారె సమర్పణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. పట్టణంలోని గడియార స్తంభం వద్ద ఉన్న కోదండ రామాలయం నుంచి మేళ తాళాలతో అంగ రంగ వైభోగంగా మహిళలు ఊరేగింపుగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానానికి చేరుకున్నారు. సారె సమర్పించారు. ఈ సందర్భంగా కల్యాణ మండపంలో లలితా సహస్రనామ పారాయణం సామూహికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు సింగరి మధు సూదన్‌రావు, ఆత్మకూరి వెంకట హరే రామ చెంచయ్య, దేవర పల్లి మల్లికార్జునరావు, చిలకల శ్రీనివాసరావు, నోముల వెంకటరమణ, దేవరశెట్టి రవి కుమార్, వనమా శివ నాగేశ్వరరావు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించండి



క్రోసూరు పీహెచ్‌సీలో ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గిరిధర్

క్రోసూరు: ఫ్లోరోసిస్ వ్యాధి గురించి ప్రజలకు ఆసుపత్రి సిబ్బంది అవగాహన కల్పించాలని ఫ్లోరోసిస్ వ్యాధి నిపుణులు, నరసరావుపేట వైద్యులు డాక్టర్ గిరిధర్ అన్నారు. క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్రోసూరు, అచ్చంపేట, ఫణిదం పీహెచ్‌సీల ఎల్ఎల్ హెచ్‌పీలకు, సీహెచ్‌వోలకు శుక్రవారం డాక్టర్ గిరిధర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోరు బావుల్లో ఫ్లోరైడ్ 1పీపీఎం కన్నా ఎక్కువ ఉంటే ఫ్లోరోసిస్ వ్యాధి వస్తుందన్నారు. బోర్‌బావుల్లో నీళ్ల వాడకూడదని, పొగాకు, బ్లాక్‌టీ, బ్లాక్ సాల్ట్ వాడకూడదన్నారు. నివారించేందుకు ఎక్కువగా కాల్షియం, విటమిన్ సీ, విటమిన్ - ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. మనం ప్రతి రోజు తాగే మంచి నీరులో ఫ్లోరోసిస్ సాంద్రత ఎక్కువగా ఉండటం వల్ల వస్తుందని, తాగే నీరు పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వివరించాలన్నారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఇన్నారావు, మూడు పీహెచ్‌సీల ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వోలు 40 మంది పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ రాగి తీగ చోరీ

బెల్లంకొండ: పొలంలో ఉన్న వ్యవసాయ మోటార్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి తీగ చోరీ చేసిన ఘటన లోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు పింగళి రవీంద్రారెడ్డి వివరాల మేరకు.. గంగమ్మ గుడి సమీపంలో ఉన్న తన పొలంలోని వ్యవసాయ మోటార్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి, వైర్లను కట్ చేసి రాగి తీగను దొంగిలించినట్లు తెలిపాడు. దీనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

తల్లిపాలతోనే బిడ్డకు రోగ నిరోధక శక్తి



హసనాబాద్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అరుణ



కోట నెమలిపురిలో గర్భిణులకు అవగాహన

దొడ్లేరు(క్రోసూరు): తల్లి పాలతోనే బిడ్డకు రోగనిరోధక శక్తి వస్తుందని దొడ్లేరు పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హసనాబాద్, ఆవులవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ధనలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాల బిడ్డకు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లు మాధవిలత, అనసూర్యమ్మ, ఆరోగ్యకార్యకర్త ప్రసన్న పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం

రాజుపాలెం: తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరమని ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వి.రవితేజనాయక్ తెలిపారు. కోటనెమలిపురిలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గ్రామస్తులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో డాక్టర్ మాట్లాడుతూ పిల్లలకు డబ్బా పాలు పట్టడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, సీహెచ్‌వో ప్రియదర్శిని, ఏఎన్ఎం రెహిన, ఎన్ రాజు, అంగన్‌వాడీ కార్యకర్త కల్యాణి, ఆశ కార్యకర్తలు మంగమ్మ, సునీత పాల్గొన్నారు.

అమ్మపాలు అమృతంతో సమానం

అచ్చంపేట: అమ్మపాలు అమృతంతో సమానమని, వ్యాధి నిరోధక శక్తినిస్తాయని మండల ప్రత్యేక అధికారి మురళి తెలిపారు. తల్లిపాలు వారోత్సవాలలో భాగంగా స్థానిక అంగన్‌వాడి కేంద్రం-4 ను పలువురు అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి గర్భిణులు, తల్లులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రసవించిన వారం రోజుల్లో ముర్రు పాలు బిడ్డకు ప్రత్యేకమైనవని చెప్పారు. అంగన్‌వాడి సూపర్‌వైజర్ ఎస్.మాణిక్యం అంగన్‌వాడి కేంద్రం పరిధిలోని గర్భిణులకు సీమంతం చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాంబాబు నాయక్, ఎంపీడీవో కె.కుసుమకుమారి, హెల్త్ సూపర్ వైజర్ పి.వెంకట్రావు, ఏఎన్ఎం తిరుపతమ్మ, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో తల్లి పాల వారోత్సవాలు

ముప్పాళ్ళ: ముప్పాళ్ళ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.అనంత లక్ష్మీ తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ పీటర్‌డేమియన్, హెచ్.వీ జోస్పిన్‌రాణి, పంచాయతీ కార్యదర్శి ఆర్.నాగేశ్వరరావు, ఏఎన్ఎం ఎం.జ్యోతి, అంగన్వాడీ కార్యకర్తలు జయలక్ష్మి కమల, జమీలాబేగం, రాజ్యలక్ష్మి, ఆశలు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు అమృతం

సత్తెనపల్లి: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.అరుణ అన్నారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలోని ఎస్సీ ఎండీ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు అన్ని విధాల శ్రేయస్కరమన్నారు. పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాపించాలన్నారు. ఎంల్‌హెచ్‌పీ యు.లలిత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు ఉన్నారు.

ఇంటర్ విద్యార్థికి చేయూత



రశీదులు అందిస్తున్న కొత్త రామకృష్ణ, వీరవల్లి శ్రీనివాసరావు

సత్తెనపల్లి: పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థి తవ్వా వెంకట కౌశిక్ ఫీజును ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ మాజీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో కృష్ణవేణి విద్యాసంస్థల అధినేత వీరవల్లి శ్రీనివాసరావు శుక్రవారం రూ.25వేలు అందించారు. విద్యార్థి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం, బీటెక్ కూడా మంచి కళాశాలలో తన సహకారంతో పూర్తిగా చదివిస్తానని హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అచ్చంపేట సీఐగా వెంకట్‌ప్రసాద్



అచ్చంపేట సీఐ వెంకట్‌ప్రసాద్



క్రోసూరు సీఐ పి.సురేష్

అచ్చంపేట: అచ్చంపేట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.వెంకట్‌ప్రసాద్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన సాధరణ బదిలీల్లో భాగంగా గుంటూరు నుంచి వచ్చారు. ఇసుక స్టాక్ పాయింట్లపై, ఇసుక రీచ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయిస్తానని, అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా చర్యలు చేపడాతానని చెప్పారు.

క్రోసూరు సీఐగా పి.సురేష్ బాధ్యతలు

క్రోసూరు: క్రోసూరు సీఐ గా పి.సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఐ గా పనిచేసిన జి.మంగారావు వీర్‌కు వెళ్లారు. సీఐ గా బాధ్యతలు తీసుకున్న సురేష్ విలేకరుల తో మాట్లాడుతూ పెదకూరపాడు, బెల్లంకొండ, క్రోసూరు సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలు పర్యవేక్షిస్తానని తెలిపారు. పలువురు రాజకీయ పార్టీల నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మూడు మండలాల ఎస్ఐలు, బాధ్యతలు అప్పగించిన సీఐ ఉన్నారు.

పెండింగ్ పనులు వేగవంతం

సత్తెనపల్లి: పట్టణంలో పెడింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలో నిరుపయోగంగా ఉన్న టిడ్కో గృహాలు, షాదీఖాన, పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ అభివృద్ధే తన మొదటి లక్ష్యమన్నారు. త్వరితగతిన పనులు ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే రఘురామ్‌నగర్‌లోని తన కార్యాల యంలో ఎస్సీ వర్గీకరణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లడారు. ముందు గా కేక్ కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓడీఎఫ్ అబ్బూరు గ్రామం సందర్శన

సత్తెనపల్లి: బహిరంగ మలవిసర్జన రహిత గ్రామమైన అబ్బూరును శుక్రవారం అధికార యంత్రాంగం సందర్శించింది. నకరికల్లు మండల ప్రత్యేక అధికారి బి.బాలు నాయక్, ఈఓపీఆర్‌డీ ఎం. శైలేంద్రకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె. రత్నబాబు, మండల కో-ఆర్డినేటర్ సిహెచ్ చిన్నపుల్లయ్య సందర్శించి గ్రామంలో ఎన్ని ఇళ్ళు ఉన్నాయి? మరుగుదొడ్లు ఎన్ని ఉన్నాయి? మరుగుదొడ్లు అందరూ వినియోగిస్తున్నారా? లేదా? అనేది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం(ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్)ను సందర్శించి తడి చెత్త, పొడి చెత్త విభజనను పరిశీలించారు. సర్పంచ్ అన్న పూర్ణమ్మ, ఏపీఎం శిఖా కృపావేణి, సెక్రెటరీ షేక్ హుస్సేన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ భార్గవ్ ఉన్నారు.

అర్థమయ్యే విధంగా బోధన

పెదకూరపాడు: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధనలు చేయాలని మండల ప్రత్యేకాధికారి ధనలక్ష్మీ, ఎంపీడీవో మల్లేశ్వరి కోరారు. పాడపాడు గ్రామంలో ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. హాజరు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు.